## పట్టుబడిన నగదును ట్రెజరీ స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరుస్తాం

- కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

సూర్యాపేట, అక్టోబర్ 17 : సార్వత్రిక ఎన్నికల సందర్భంగా చేపడుతున్న తనిఖీల్లో పట్టుబడిన నగదు, వస్తువులను ట్రెజరీ స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరుచడం జరుగుతుందని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ట్రెజరీ స్ట్రాంగ్ రూమ్, ఎన్నికల విభాగంలో మీడియా సెంటర్, ఇతర విభాగాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. అధికారులు, సిబ్బంది ఎన్నికల నియమావళిని తప్పక పాటించాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, పోలీస్ బృందాలు నిరంతరం తనిఖీలు చేపట్టి పట్టుబడిన నగదు, బంగారం, వెండి వస్తువులను కలెక్టరేట్‌లోని ట్రెజరీ స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరుచడం జరుగుతుందన్నారు. జిల్లా స్థాయిలో గ్రీవెన్స్ కమిటీ ఆధారాలను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటారని చెప్పారు. ఎన్నికల నేపథ్యంలో మీడియా సెంటర్ ద్వారా వీలైనంత సమాచారం అందించాలన్నారు. అనంతరం ఎన్నికల విభాగాన్ని పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏటీఓ అనీల్‌కుమార్, డీపీఆర్‌ఓ రమేశ్‌కుమార్, ఏఓ సుందర్శన్‌రెడ్డి, డీఎల్‌పీఓ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.


సూర్యాపేట : ఎన్నికల విభాగంలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

### ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు..

తుంగతుర్తి : ఎన్నికల నియమ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ అధికారులను హెచ్చరించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎన్నికల సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. పోలింగ్ కేంద్రాలను అధికారులు పరిశీలించి సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించాలన్నారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా 1950కు ఫోన్ చేసి మాట్లాడవచ్చన్నారు. ఆన్‌లైన్‌లో ఎన్నికల యాప్ కూడా వాడుకోవచ్చన్నా రు. సరిహద్దుల్లో సిబ్బందిని పెంచాలన్నారు. ఎన్నికల ఖర్చు ఏ పార్టీ ఎంత ఖర్చు పెడుతుందో ఖచ్చితంగా రాయాలని పేర్కొన్నారు. ఆయన వెంట తుంగతుర్తి అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి వెంకట్‌రెడ్డి, ఎస్పీ రాహుల్ హెగ్డే, నాగేశ్వర్‌రావు ఉన్నారు.

## గురి కుదిరింది

### సూర్యాపేటను ఆర్చరీకి వేదిక చేసిన మంత్రి జగదీశ్‌రెడ్డి

- సొంత ఖర్చులతో ఉచిత శిక్షణ
- రాష్ట్రస్థాయి పోటీలకు ఐదుగురు విద్యార్థుల ఎంపిక
- ఈ నెల 21న హైదరాబాద్‌లో పోటీలు
- సత్తా చాటేందుకు సిద్ధమవుతున్న క్రీడాకారులు


సూర్యాపేటలో శిక్షణ కేంద్రం నుంచి రాష్ట్ర స్థాయి విలువిద్య ఇండియన్ రౌండ్ జూనియర్స్ విభాగానికి ఎంపికైన క్రీడాకారులు

సూర్యాపేట టౌన్, అక్టోబర్ 17 : అతి ప్రాచీన క్రీడ విలువిద్య. రామాయణం, మహాభారతం, జానపద కథల్లో ఎక్కడ చూసినా ధనుర్విద్యకు ఎంతో ప్రాముఖ్యం. ద్రోణుడు, అర్జునుడు, కర్ణుడు వంటి ధనుర్ధారులైన మహామహులకు నెలవు ఈ నేల. కాల క్రమంలో సరైన సదుపాయాలు, శిక్షణ, ప్రోత్సాహం లేక ఈ క్రీడ నిపుణుల కొరతను ఎదుర్కొంటుంది. దాంతో విశ్వ క్రీడా వేదికలపై పతకాల లేమిని చవి చూడాల్సిన పరిస్థితి. కాగా ఇప్పుడిప్పుడే విలువిద్య తిరిగి పూర్వ వైభవాన్ని సంతరించుకుంటుంది. ఈ క్రమంలో ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేక ఆదరణ పొందుతున్న విలువిద్య క్రీడను మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి సూర్యాపేటలో ప్రారంభించారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులను అన్ని విధాలుగా ప్రోత్సహించి వారిలోని ప్రతిభను వెలికితీయాలనే సంకల్పంతో భద్రాద్రి కొత్తగూడెం నుంచి ప్రత్యేక నిపుణులను తీసుకువచ్చి శిక్షణ ఇప్పించారు. స్వంత ఖర్చులతో క్రీడాకారులకు అవసరమైన విలువిద్య సామగ్రిని సమకూర్చి నిపుణులకు జీతాలు ఇచ్చి అన్ని విధాల అండదండగా నిలిచారు. అంతే కాకుండా 2014 నుంచి అన్ని రకాల క్రీడలను ప్రోత్సహిస్తూ మంత్రి సూర్యాపేటను ఓ క్రీడా హబ్‌గా మార్చుతున్నారు. ఈ క్రమంలోనే విలువిద్యను సైతం సూర్యాపేటలో ప్రారంభించి క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారు.

### 48 మంది క్రీడాకారులకు శిక్షణ..

ఈ ఏడాది మే 10న సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పబ్లిక్ క్లబ్‌లో మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి చేతుల మీదుగా విలువిద్య శిక్షణ ప్రారంభమైంది. శిక్షణ పొందేందుకు వచ్చిన వారిలో 48 మందిని ఎంపిక చేశారు. వారికి జూన్ 10 వరకు నెల రోజుల పాటు శిక్షణ అందించారు. శిక్షణకు మంత్రి పూర్తి సహాయ సహకారాలు అందించారు.

### రాష్ట్ర స్థాయికి ఐదుగురు ఎంపిక..

ఈ నెల 21 నుంచి ప్రారంభం కానున్న రాష్ట్ర స్థాయి విలువిద్యకు సూర్యాపేటతో పాటు ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి ఐదుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. సూర్యాపేటలో నెల రోజుల పాటు 48 మంది శిక్షణ పొందగా వారికి పోటీలు నిర్వహించి నిపుణులు ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఐదుగురిని ఎంపిక చేశారు. సూర్యాపేటకు చెందిన చామకూరి సాత్విక, బోస్క స్నిగ్ధ, కొల్లు మహేందర్, డి.శశిధర్‌యాదవ్, దాసరి మహిమాన్విత్, పి.రవీందర్‌కు రాష్ట్ర స్థాయిలో అవకాశం రాగా ప్రస్తుతం వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. వారంతా ఈ నెల 21న హైదరాబాద్‌లోని కొల్లూరు ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో జరిగే విలువిద్య పోటీల్లో జూనియర్స్ ఇండియన్ రౌండ్ విభాగంలో పాల్గొననున్నారు.

### కల నెరవేర్చిన మంత్రికి కృతజ్ఞతలు



టీవీ, వీడియోలు, పుస్తకాల ద్వారా తెలిసిన విలువిద్య నేర్చుకోవాలనే తపన ఉండేది. అది కలగానే మిగిలిపోతుంది అనుకున్నా. కానీ ఈ ఏడాది మే నెలలో సూర్యాపేటలో మంత్రి జగదీశ్‌రెడ్డి సారు ఉచితంగా విలువిద్య శిక్షణ ఇప్పిస్తున్నారు అని తెలియగానే ఎంతో సంతోషించా. వెంటనే మా ఇంట్లో వాళ్లు చేర్పించడంతో నెల రోజుల పాటు శిక్షణ పొంది రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యా. మా కల నెరవేర్చిన మంత్రికి కృతజ్ఞతలు

– చామకూరి సాత్విక, సూర్యాపేట

### ఇండియన్ రౌండ్‌లో అవకాశం గర్వంగా ఉంది



కేవలం నెల రోజులు శిక్షణతో తమకు జూనియర్ విభాగంలో ఇండియన్ రౌండ్ విలువిద్యలో అవకాశం రావడం గర్వంగా ఉంది. అందులో మంచి ప్రతిభ కనబరిచి అందరి పేరు నిలబెడతా. శిక్షణ నిరంతరాయంగా కొనసాగితే నాలాంటి క్రీడాకారులకు ఎంతో ప్రోత్సాహకంగా ఉంటుంది. అన్ని విధాలుగా సహకరించిన మంత్రి జగదీశ్‌రెడ్డి గారికి, ప్రొత్సహించిన తల్లిదండ్రులు, శిక్షణ ఇచ్చిన గురువులకు ప్రత్యేక కృతజ్ఞతలు.

– డి. శశిధర్‌యాదవ్, సూర్యాపేట

### మంత్రి ప్రోత్సాహం బాగుంది



సూర్యాపేటలో అన్ని రంగాల అభివృద్ధితో పాటు క్రీడారంగం అభివృద్ధికి మంత్రి జగదీశ్‌రెడ్డి గారి ప్రోత్సాహం చాలా బాగుంది. ప్రధానంగా విలువిద్య క్రీడను సూర్యాపేటకు తీసుకురావాలనే ఆలోచన మంత్రికి రావడం అద్భుతం. అనుకున్నదే తడవుగా సూర్యాపేట విద్యార్థులకు విలువిద్యలో మంచి శిక్షణ ఇప్పించాలని భద్రాద్రి కొత్తగూడెం నుంచి తమను పిలించి, అలాగే నేషనల్ చాంపియన్స్‌తో అవగాహన కలిపించడం విశేషం. నెల రోజుల పాటు తమకు అన్ని విధాలుగా అండగా నిలిచి పూర్తి ఉచితంగా శిక్షణ ఇప్పించడం గొప్ప విషయం. 48 మందికి శిక్షణ ఇవ్వగా అందులో ఐదుగురు రాష్ట్ర స్థాయిలో జూనియర్స్ ఇండియన్ రౌండ్‌కు ఎంపికయ్యారు. ఈ నెల 21న హైదరాబాద్‌లో జరిగే పోటీల్లో వారు ఉత్తమ ప్రతిభ కనబరిచి సూర్యాపేటకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నా.

– పి. రవీందర్, విలువిద్య కోచ్, భద్రాద్రి కొత్తగూడెం

## బీజేపీని అధికారంలోకి రాకుండా అడ్డుకుంటాం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

బొడ్రాయబజార్, అక్టోబర్ 17 : మతోన్మాద బీజేపీ అధికారంలోకి రాకుండా అడ్డుకుంటామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. మంగళవారం స్థానిక విఘ్నేశ్వర ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సీపీఎం సూర్యాపేట జిల్లా స్థాయి శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. దేశంలో నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చాక మతోన్మాద చర్యలకు పాల్పడుతూ మేధావులను, జర్నలిస్టుల హక్కులను హరిస్తున్నట్లు చెప్పారు. లాభాల్లో ఉన్న ఎల్ఐసీ, రైల్వే, పోస్టల్, విమానయానం, విశాఖ ఉక్కు వంటి ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా అంబానీ అదానీలకు కట్టబెడుతున్నాడని విమర్శించారు. మరోవైపు నిత్యావసర వస్తువుల ధరలను విపరీతంగా పెంచి సమాన్యులపై భారం మోపుతుందని మండిపడ్డారు. దేశంలో కుల గణన చేపట్టడం మూలంగా అట్టడుగు వర్గాల్లో ఉన్న బీసీలకు ఎంతో లాభం జరుగుతదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎడ్యూకేషన్ కమిటీ నాయకుడు బండారు రమేశ్, సీనియర్ నాయకుడు నాగిరెడ్డి శేఖర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, బుర్రి శ్రీరాములు, పారేపల్లి శేఖర్‌రావు, మట్టిపల్లి సైదులు, మేదరమెట్ల వెంకటేశ్వర్‌రావు, చెరుకు ఏకలక్ష్మి, కోట గోపి పాల్గొన్నారు.

## జడ్జి ఏగా కరాటే మాస్టర్ సయ్యద్


జడ్జి ఏగా అర్హత సర్టిఫికెట్‌ను అందుకుంటున్న కరాటే మాస్టర్ సయ్యద్

బొడ్రాయిబజార్, అక్టోబర్ 17 : జాతీయ కరాటే రెఫరీ నియమకానికై వరల్డ్ కరాటే ఫెడరేషన్ గడిచిన ఆదివారం హైదరాబాద్‌లో పరీక్షలు నిర్వహించి ఎంపిక చేసింది. 300ల మంది మాస్టర్లు పాల్గొన్న ఈ పరీక్షలో సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన కరాటే మాస్టర్ షేక్ సయ్యద్ జడ్జి ఏగా అర్హత సాధించారు. ఈ మేరకు జాతీయ ప్రధాన కార్యదర్శి రజిని చౌదరి చేతుల మీదుగా సర్టిఫికెట్‌ను అందుకున్నారు. పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారిని తెలంగాణ రెఫరీ కమిషన్ ఛైర్మన్ సెన్సాయ్ పాపయ్య, రాష్ట్ర అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పి.నరేందర్, కోశాధికారి సాయికుమార్ అభినందించారు.

## అనంతారంలో బతుకమ్మ సంబురాలు

- పాల్గొన్న గుంటకండ్ల సునీతాజగదీశ్‌రెడ్డి


అనంతారంలో మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతున్న గుంటకండ్ల సునీత

పెన్‌పహాడ్, అక్టోబర్ 17 : మండలంలోని అనంతారం గ్రామంలో నాలుగో రోజు బతుకమ్మ ఉత్సవాలను సర్పంచ్ బైరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేడుకకు మంత్రి జగదీశ్‌రెడ్డి సతీమణి సునీత హాజరై మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం రాకతో సీఎం కేసీఆర్ నేతృత్వంలో ఊరు వాడ బతుకమ్మ సంబురాలు అంబరాన్ని అంటుతున్నాయన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఒంటెద్దు నర్సింహారెడ్డి, జడ్పీటీసీ మామిడి అనితాఅంజయ్య, ఎంపీటీసీ మామిడి రేవతి, నాయకులు పాల్గొన్నారు.

## నీళ్లు పోసి మొక్కలను కాపాడాలి

- ఎంపీడీఓ శ్రీనివాస్‌రావు

సూర్యాపేట రూరల్, అక్టోబర్ 17 : నీళ్లు పోసి మొక్కలను, ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ఎంపీడీఓ శ్రీనివాస్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని తాళ్లకాంపాడ్ గ్రామంలో నర్సరీలో మొక్కలకు నీళ్లు పోసి మాట్లాడారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఏఈ భరత్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి రేవతి పాల్గొన్నారు.